


# "మమ్మీ!"

—ప్రషాడార్కె

మాఅబ్బాయి అప్పుడే కాన్వెంటు నుంచి వచ్చాడు. రావటంతోనే "అమ్మా! ఏమైనా పెట్టవే!" అంటూ కిచెన్ (వంటిల్లు అని వ్రాయగూడదు) లోకి వెళ్ళాడు తల్లి (మమ్మీ) కోసం.

ఆవిడ మొఖం చిట్లించుకొని "అమ్మా ఏమిట్రా బొమ్మ లాగా! మమ్మీ అని పిలవలేవ్!" అంది.

అంతవరకూ ఉత్సాహంగా వున్న మా అబ్బాయి ముఖం నల్లబడింది. చిన్నబోయింది. తల్లిని ఏం అనలేక "సారీ మమ్మీ" అనేసి బయటకు వచ్చేశాడు.

ఇదంతా చూస్తున్న నాకు బాధనిపించింది. బాబుని పిలిచి... "ఏం నాన్నా! అమ్మ మమ్మీ అనమంటుంది కదా! అలాగే పిలవొచ్చుగా!" అన్నాను.

"నువ్వే అంటున్నావు కదా నాన్న అమ్మ అమ్మే అని. మరలా అమ్మను మమ్మీ అని ఎందుకు పిలవాలి?" అన్నాడు.

"నిజమే. నీకు అమ్మే! కానీ అమ్మకు నీ చేత మమ్మీ అని పిలిపించుకోవాలని వుంది కదా! అలా పిలవటంలో తప్పేముందే!" అని అడిగాను దగ్గరకు తీసుకొని.

"అయితే నీవు మీ అమ్మను మమ్మీ అని ఎందుకు పిలవవు?" అడిగాడు వాడు.

"మా అమ్మ ముసలమ్మ! ఆమెకు ఇంగ్లీష్ రాదు. నేను అట్లా పిలిచినా మా అమ్మకు అర్థం కాదు" అని విడమరిచి చెప్పాను.

"మా అమ్మకు ఇంగ్లీష్ వచ్చు కాబట్టి నేను మమ్మీ పిలవాలా?" అని ఎదురు ప్రశ్న వేశాడు వాడు.

"మీ అమ్మకు ఇంగ్లీష్ వచ్చు అని కాదు. నీవు కాన్వెంటులో ఇంగ్లీష్ చదువు చదువుతున్నావు కాబట్టే అలా పిలవాలి..." అని లేదు.

"మరి నీవు ఇంగ్లీష్ చదువు బాగా చదివావుగా, పెద్ద ఉద్యోగం చేస్తున్నావ్ గా! నీవు ఎందుకు బామ్మను మమ్మీ అని పిలవవ్?" అని నిగ్గదీశాడు.

వీడి మనస్సులో మమ్మీ అనే పదం మీద ఎలర్జీ ఏదో వుందనిపించింది. అదేమిటో కనుక్కుందామని "సరే, ఇకనుంచి మా అమ్మను నేను మమ్మీ అనే పిలుస్తాను. మరి నువు మీ అమ్మను అలాగే మమ్మీ అని పిలుస్తావా?" అని అడిగాను ఏం చెప్తాడో అని.

"పిలవను!" అని ఖచ్చితంగా చెప్పాడు.

ఈసారి నా మొఖం నల్లబడింది. "ఏం!" అన్నాను నీరసంగా.

దానికి వాడు చెప్పిన సమాధానం నా తలకాయను గిర్రున తిప్పేసింది. వాడి సమాధానం ఇది.

"పొద్దున్న క్లాసులో రాజీవ్‌ను టీచర్ స్కేలు పెట్టి కొట్టింది నాన్నా! (నన్ను డాడీ అనడువాడు.) వాడు పెద్దగా 'అమ్మా!' అని ఏడిచాడు. ఇంకా కొట్టింది టీచర్ "మమ్మీ!" అని ఏడవలాలట!" వాడు మమ్మీ! మమ్మీ! అని ఏడిచేదాకా కొట్టింది నాన్నా! వాడ్ని చూసి మాకందరికి ఏడుపొచ్చింది. మేమంతా "అమ్మా!" అని ఏడవబోయి... మమ్మీ! అనే ఏడిచాం నాన్నా! ఏడుపు వస్తుంటే- అమ్మ గుర్తుకు వస్తుంటే- 'అమ్మా అని ఏడవాలా? మమ్మీ అని ఏడవాలా!' అని ఆలోచిస్తూ ఏడవాలా నాన్నా మేం?"

మా సంభాషణంతా వింటున్న నా వైఫ్ ( నా భార్య) కొడుకు దగ్గరకు వచ్చి వాడ్ని వాటేసుకుని "నన్ను అమ్మా అనే పిలువు తండ్రీ!" అంటూ ఎందుకో బావురుమంది. తన అమ్మ గుర్తుకొచ్చిందేమో!